సాక్షి వరంగల్

శుక్రవారం । 12 । జనవరి । 2024



ఆదాయ పన్ను నిబంధనలపై..

ఆదాయ పన్ను నిబంధనలపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన ఉండాలని కేంద్ర ప్రభుత్వ అధికారి, ఆదాయ పన్ను జిల్లా ఇన్‌చార్జ్‌లు మాధవి, సునీల్‌కుమార్ తెలిపారు. - 8లో▸



డీఎంహెచ్‌ఓ లంచావతారం

జనగామ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ ఎండీ అజహర్ లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/18^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం చలి ఉంటుంది. రాత్రివేళ పొంగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సౌజన్య



నల్లబెల్లి: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సౌజన్య హెచ్చరించారు. మండలంలోని మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులతోపాటు గదిలో నిల్వ చేసిన నిత్యావసర సరుకులు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట తయారు చేసే సమయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వర్కర్లకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, డిప్యూటీ వార్డెన్ పద్మావతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆయకట్టుకు నీటి విడుదల

రాయపర్తి: ఎస్సారెస్పీ స్టేజ్–2 ద్వారా పాలకుర్తి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆయకట్టుకు నీటిని విడుదల చేసినట్లు జనగామ ఐబీ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ రెడ్డిమల్ల సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, లోయర్ మానేరు డ్యాం, ఇతర రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యత లేకపోవడంతో చివరి భూములకు సరిపడా సాగునీటిని అందించలేకపోతున్నట్లు తెలిపారు. బావులు, బోరు సదుపాయం ఉన్న చివరి ఆయకట్టు రైతులు కాల్వ నీటిపై ఆధారపడకుండా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోతిరెడ్డిపల్లిలో డీఎల్పీఓ విచారణ



రాయపర్తి: నిధుల దుర్వినియోగంపై మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో డీఎల్పీఓ ప్రభాకర్, ఎంపీఓ రామ్మోహన్ గురువారం విచారణ చేశారు. గ్రామపంచాయతీ క్యాష్‌బుక్, తీర్మాన కాపీలు, ఇంటిపన్నుల పుస్తకాలు పరిశీలించారు. పలు రికార్డులు వారి వెంట తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ లకావత్ సమ్మక్క భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ తీర్మానాలు, రికార్డులు, బిల్లులు లేకుండానే 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు ఇంటి పన్నులు, నల్లా పన్నుల డబ్బులు సుమారు రూ.70 వేలను గ్రామ పంచాయతీ కార్యదర్శి తన సొంతానికి వాడుకుందని తెలిపారు. గేదెలను వేలం వేయగా వచ్చిన రూ.60 వేలను క్యాష్‌బుక్‌లో నమోదు చేయలేదని, జీపీ రికార్డులను ఆడిట్ చేయించలేదని తెలిపారు. ఆడిట్‌కు ఎన్నిసార్లు పిలిచినా రావడం లేదన్నారు. గ్రామాభివృద్ధి డబ్బులను తన సొంత ఖర్చులకు వాడుకున్న కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అధికారులను కోరారు.

డీపీఎస్‌ఈకి రెండో దశ కౌన్సెలింగ్

విద్యారణ్యపురి: డీఈఈసెట్–23లో ర్యాంకు సాధించిన అభ్యర్థులకు డీపీఎస్‌ఈ డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ రెండోదశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు. మొదటిదశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు సైతం స్లైడింగ్ ఎంపికలను వినియోగించుకోవచ్చన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://డీఈఈసెట్.ఈడీఎస్ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఆప్షన్లు ఎంచుకోవాలన్నారు. రెండో దశ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గతంలో హాజరు కాని అభ్యర్థులు సైతం ఈనెల 17న హాజరు కావొచ్చని తెలిపారు. దశ రెండు కింద డీఈఐఈడీ, డీపీఎస్ఈ కోర్సుల కోసం డీఈఈసెట్–23లో పొందిన ర్యాంకు ప్రకారం అభ్యర్థులు కళాశాలల వెబ్ ఆధారిత ప్రాధాన్యాల్ని ఈనెల 18 నుంచి 22 వరకు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మెరిట్ ఆర్డర్ వెబ్ ఆధారిత ర్యాంకు ప్రకారం రిజర్వేషన్ రూల్ ఆధారంగా అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఈనెల 25న ఉంటుందని తెలిపారు. నిర్ణీత ఫీజులు డీఈఐఈడీ, డీపీఎస్ఈ కోర్సులకు సక్రమంగా చెల్లించేందుకు సంబంధిత కళాశాలలకు ఈనెల 26 నుంచి 29 వరకు నివేదించాలన్నారు. అభ్యర్థుల సీట్ల కేటాయింపు ఈనెల 31న ఉంటుందని పేర్కొన్నారు. ఆయా కోర్సులకు సంబంధించి సంబంధిత కళాశాలలకు అభ్యర్థుల సీట్ల మార్పిడిపై నివేదించడం ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు ఉంటుందని తెలిపారు.

బడిలో వెలగాలి గృహజ్యోతి

ఉచిత విద్యుత్ పథకంలో ప్రభుత్వ పాఠశాలలను చేర్చాలి

- విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీలు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి
- స్కూల్ గ్రాంట్‌లో సింహభాగం కరెంట్ బిల్లులకే చెల్లింపు
- జిల్లాలో 577 సర్కారు స్కూళ్లు.. 42,581 మంది విద్యార్థులు



సంగెం మండలం మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సంగెం: ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా చదువుకునే విద్యార్థులు బడుగుబలహీన వర్గాలకు చెందిన వారే ఉంటారు. నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌కు పంపించలేక ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇలాంటి పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను కూడా ఉచిత విద్యుత్ పథకంలో చేరిస్తే భారం తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీలు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. తెల్లరేషన్ కార్డులు కలిగిన వారికి గృహజ్యోతి పథకంలో భాగంగా గృహ అవసరాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 6 గ్యారంటీల్లో చెప్పింది. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి పథకం అమలు చేసేందుకు అవసరమైన కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు సైతం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు వేడుకుంటున్నారు. కాగా, జిల్లాలోని 577 ప్రభుత్వ పాఠశాలల్లో 42,581 మంది విద్యార్థులు చదువుతున్నారు.

సౌకర్యాలుంటే విద్యార్థులు పెరిగే అవకాశం

విద్యుత్ బిల్లులు అదనపు భారం

పాఠశాలలకు ప్రతినెల వస్తున్న విద్యుత్ బిల్లులు అదనపు భారంగా పరిణమిస్తున్నాయి. అంతే కాకుండా గృహ అవసరాల మాదిరిగా కాకుండా పాఠశాలలకు సరఫరా చేసే ఒక యూనిట్ విద్యుత్ బిల్లు రూ.8కిపైగా ఉంది. 6 గదులు ఉన్న ప్రాథమిక పాఠశాలకు నెలకు రూ.800కు పైగా.. 6 నుంచి 10 గదులున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సగటున రూ.1,100పైన బిల్లులు వస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. అదనంగా సర్ చార్జీలు, ఆలస్యమైతే జరిమానాల రూపంలో మరో రూ.200 వరకు బిల్లులో కలుస్తున్నది. దీంతో ఆయా పాఠశాలలకు ప్రతి ఏటా రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు విద్యుత్ బిల్లులకే వ్యయం అవుతున్నట్లు చెబుతున్నారు. అదనపు బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో పాఠశాల మెయింటెనెన్స్ గ్రాంట్ నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించాలంటే తడిసిమోపెడవుతోంది. దీంతో విద్యుత్ బిల్లులు పేరుకుపోతున్నాయని, గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలుంటే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. మన ఊరు–మన బడి కింద పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు, ఎల్‌ఈడీ టీవీలను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదుకు ఈపాస్ యంత్రాలు కూడా అమర్చారు. ఫ్యాన్లు తిరగడానికి, ట్యూబ్‌లు వెలగడానికి, ఈపాస్ యంత్రాల చార్జింగ్, కంప్యూటర్లు, డిజిటల్ తరగతుల కోసం విద్యుత్ తప్పనిసరి.

బోధన సులువు అవుతుంది..



ఉచిత విద్యుత్ అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం అమర్చిన డిజిటల్ ప్యానల్ బోర్డులు, ఎల్‌ఈడీలు మరింత ఎక్కువగా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. డిజిటల్ బోధనతో విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుంది. ఉచిత విద్యుత్ అందిస్తే పాఠశాలలకు బిల్లుల భారం తగ్గుతుంది.

– శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ తీగరాజుపల్లి

భారం తగ్గుతుంది..



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తే బాగుంటుంది. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలను ఉచిత విద్యుత్ పథకంలోకి తీసుకొస్తే భారం తగ్గుతుంది. పాఠశాల గ్రాంట్ నిధులతో చాలా వరకు విద్యుత్ బిల్లులే చెల్లిస్తున్నారు. దీంతో నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.

– మడత కేశవులు, ఎస్‌ఎంసీ చైర్మన్ మొండ్రాయి



యువతరం.. సేవాపథం

- సామాజిక సేవల్లో నవతరం
- ఆపదొస్తే అండగా నిలుస్తున్న యువత
- నేడు జాతీయ యువజన దినోత్సవం

- 8లో▸

'ఉక్కు సంకల్పం కలిగిన కొద్దిమంది యువతను నాకిస్తే ఈదేశ గతిని మార్చేస్తా' అని ప్రకటించిన స్వామి వివేకానందుడి మాటలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతను చూస్తే గుర్తొస్తాయి. న్యూటన్ మూడో గమన నియమం ప్రకారం.. గోడకు కొట్టిన బంతి అంతే వేగంగా తిరిగొస్తుంది. సేమ్ టూ సేమ్.. యువతరానికి కొద్దిగా స్ఫూర్తినిస్తే చాలు.. అంతే వేగంగా ఏ రంగంలోనైనా దూసుకెళ్తున్నారు. ఇటు కెరీర్‌పై దృష్టి పెడుతూనే.. అటు సేవాపథంలో నడుస్తున్న యువతరంపై నేడు (శుక్రవారం) జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

ఆర్డీఓకు అవిశ్వాస తీర్మానం నోటీస్



ఆర్డీఓ వాసుచంద్రకు అవిశ్వాస తీర్మాన నోటీస్ అందిస్తున్న కౌన్సిలర్లు

వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణ, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డిపై కౌన్సిలర్ పాలకుర్తి సుజాత ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీఓ వాసుచంద్రకు అవిశ్వాస తీర్మానం నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపాలిటీలో మూడున్నర సంవత్సరాల కాలంలో రూ.6.5 కోట్లపైచిలుకు నిధులు దుర్వినియోగమయ్యాయని పేర్కొన్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్‌తో చైర్‌పర్సన్ అంగోత్ అరుణ, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి కుమ్మక్కై, అభివృద్ధి పనుల పేరుతో అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారన్నారు. ఈ విషయంపై మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఆనాటి ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి జరిగిన అభివృద్ధి పనుల వివరాలు, తీర్మానాల కాపీలను అందించాలని కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం కూడా ఇచ్చినట్లు గుర్తుచేశారు. మన ప్రభుత్వం అధికారంలో ఉంది, గొడవ చేస్తే పరువుపోతుంది, ఉప ఎన్నిక అనంతరం అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అరూరి రమేష్ హామీ ఇచ్చి దాటవేశారని చెప్పారు. ఈ విషయంపై తాము మాట్లాడినా చైర్‌పర్సన్ స్పందించలేదని, తీర్మానాల కాపీలు, పనుల వివరాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో తాము విసుగెత్తి అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదన చేసినట్లు వివరించారు.

మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు..

మున్సిపాలిటీ పరిధిలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లు తోటకూరి రాజమణి, బానోత్ అనిత, పాలకుర్తి సుజాత, కోదాటి పద్మ, పూజారి సుజాత, మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్ బీఆర్‌ఎస్ నుంచి గెలిచారు. సమ్మెట సుధీర్, భూక్యా సరిత కాంగ్రెస్ నుంచి, కొండేటి అనిత బీజేపీ నుంచి గెలుపొందారు. తోటకూరి రాజమణి.. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌కు మద్దతుగా ఉండగా.. మిగిలిన 9 మంది అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించారు.

ఓ సిటీ స్టేడియంలో ముగ్గుల పోటీలు



ఓ సిటీ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

కాశిబుగ్గ: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓ సిటీ స్టేడియంలో గురువారం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. యువతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగుల రంగుల ముగ్గులు వేశారు. మొదటి బహుమతి వసంత, లత, గంగ, రెండో బహుమతి శోభారాణి, సుధ, అపర్ణ, మూడో బహుమతి స్రవంతి, వాణి, మాధవి, విజయలక్ష్మి, హర్షిత, అఖిల, కన్సోలేషన్ బహుమతి వైష్ణవి, సౌమ్య, భవాని, శ్రీలత గెలుచుకున్నారు. అలాగే, క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి పాలిటెక్నిక్ వరంగల్ టీం, రెండో బహుమతి డీఎస్‌ఏ వరంగల్ టీం గెలుచుకుంది. కెమిస్ట్రీ భవన్‌లో నిర్వహించిన బాలుర జూడో పోటీల్లో 55 కిలోల విభాగంలో మొదటి బహుమతి జి.రిత్విక్‌రెడ్డి, రెండో బహుమతి సీహెచ్.యోగేష్, 81 కిలోల విభాగంలో మొదటి బహుమతి విక్రమ్, రెండో బహుమతి టి.రోహన్‌సింగ్ సాధించాడని జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం ఓ సిటీ స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడక నిషేధంపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. కోచ్‌లు వై.సుమన్, నాగరాజు, సిబ్బంది మౌనిక, రాజేందర్, అహ్మద్ పాల్గొన్నారు.

మిర్చి పంటలను పరిశీలించిన అధికారులు



నర్సంపేట రూరల్ : మాదన్నపేటలో మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నర్సంపేట రూరల్: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు నర్సంపేట మండలంలోని మాదన్నపేట, భాంజీపేట గ్రామాల్లో మిర్చి పంటలను గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ జేడీఏ సుజాత, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ రహమాన్ సందర్శించారు. మాదన్నపేట గ్రామంలో పెసర లావణ్య, భాంజీపేట గ్రామంలో కట్ల వీరారెడ్డి చపాట మిర్చి తోటలను పరిశీలించారు. రైతులు పురుగు మందులు వాడే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. మిర్చి పంటలో ఆశిస్తున్న పురుగులు, తెగుళ్ల నివారణ మార్గాలు, పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు. క్షేత్రస్థాయిలో తెలుసుకున్న వివరాలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సీఎస్‌వీ.మధుసూదన్, మార్కెటింగ్ శాఖ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్‌రావు, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం జిల్లా కన్సల్టెంట్ సారంగం, ఉద్యాన శాఖ అధికారులు శంకర్, జ్యోతి, మండల వ్యవసాయాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నెక్కొండ: సమగ్ర సస్యరక్షణ చర్యలతో మిరపలో ఆశించిన తెగుళ్లను నివారించవచ్చని జేడీఏ సుజాత, పీజేటీఎస్‌యూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌జే.రహమాన్, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సీఎస్.మధుసూదన్ అన్నారు. అలంకానిపేట గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ మిరప తోటను వారు గురువారం పరిశీలించి మాట్లాడారు. రైతులు ఏ పురుగు మందులు వాడాలో ముందే తెలుసుకోవాలని సూచించారు. తెగుళ్ల నివారణ మార్గాలు, ఏ మందు పిచికారీ చేయాలో వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఉన్నత శ్రేణి అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్‌రావు, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం జిల్లా కన్సల్టెంట్ సారంగం, ఉద్యానశాఖ అధికారి శంకర్, ఏఓ నాగరాజు, ఏఈఓలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



కొంరయ్య (ఫైల్)

నల్లబెల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతిచెందాడు. ఎస్సై నైనాల నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దస్తగిరిపల్లి గ్రామానికి చెందిన ఎల్ల బోయిన కొంరయ్య (64) నల్లబెల్లిలోని ఓ వైన్స్‌లో పనిచేస్తున్నాడు. వైన్స్‌లో పని ముగించుకొని ఈనెల 7న సాయంత్రం సైకిల్‌పై ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో శనిగరం శివారులో దుగ్గొండి మండలం మంగళితండాకు చెందిన ధరావత్ సంతోష్ తన ద్విచక్రవాహనంపై అటువైపు వెళ్తూ కొంరయ్య సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కొంరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని 108 వాహనంలో నర్సంపేటలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అదేరోజు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ కొంరయ్య బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కొమురమ్మ, కుమార్తె మమత ఉన్నారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య..



ధరావత్ రమేష్ (ఫైల్)

నెక్కొండ: రెడ్లవాడ శివారు పిట్టకాలుబోడు తండా జీపీకి చెందిన రైతు ధరావత్ రమేష్ (45) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై షేక్ జానీపాషా గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రమేష్ ఐదు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం పలు ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 10న వ్యవసాయ బావి వద్ద క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పని ప్రదేశాల్లో యూనిఫామ్ ధరించాలి

కేయూ క్యాంపస్: కేయూలోని పని ప్రదేశాల్లో ఏకరూప దుస్తులు ధరించాలని రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావు కోరారు. గురువారం పరీక్షల విభాగ కార్యాలయంలో ఉద్యోగులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ నర్సింహారావు, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, టెక్నికల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, నందయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌షుకూర్, బాధ్యులు కొర్నెల్, మల్లికాంబ, మజార్‌అలీ, ఎల్లస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

- డీఆర్‌డీఏ ఏపీడీ వీర్ల వేణు



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

వర్ధన్నపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామైక్య సంఘాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నిర్దేశించిన గడువులోగా ఆడిట్ నిర్వహించడానికి సహకరించాలని డీఆర్‌డీఏ ఏపీడీ వీర్ల వేణు అన్నారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో గురువారం గ్రామైక్య సంఘాల రికార్డుల అంతర్గత ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ఇల్లంద, ల్యాబర్తి క్లస్టర్ల ఆడిట్ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గ్రామైక్య సంఘాల సహాయకులు నెలవారీ సమావేశాల లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో అవకతవకలు జరిగే అవకాశముందన్నారు. రికార్డుల నమోదులో జరిగే తప్పిదాలకు ప్రతినిధులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీబీఓ ఆడిటర్ పెళ్లి సంపత్, సీసీలు గోలి కొమురయ్య, రమేష్, స్వామి, ఇల్లంద, ఉప్పరపల్లి గ్రామాల వీఓ ప్రతినిధులు, వీఓ సహాయకులు తక్కళ్లపల్లి పద్మావతి, రమ, ఎండీ నజీమా, బొంతల రజిత, రోజా, మమత, లక్ష్మి, అనిత, సీఆర్పీలు మహబూబా, కవిత, సునీత, మాధవి, పర్వతగిరి, రాయపర్తి ఎస్పీబీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ వేగంగా పూర్తిచేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య



రైస్‌మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్: సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని, రా రైస్, బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈమేరకు గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో రబీ 2022–23, వానాకాలం 2022–23 సీఎంఆర్ డెలివరీపై పౌరసర ఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్స్‌తో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 118 రైస్ మిల్లులు ఉన్నాయని అన్నారు. వానాకాలం 2022–23లో 1,79,925 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయగా.. 1,07,673 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పూర్తయ్యిందని తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా రా రైస్, బాయిల్డ్ రైస్ పూర్తి చేసేందుకు రైస్ మిల్లర్లు సహకరించాలని సూచించారు. వేసవిలో 15,39,04,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఇప్పటి వరకు 24,221.006 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీ చేసినట్లు వివరించారు. 2022–23 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎస్‌సీ, ఎఫ్‌సీఐ అధికారులకు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సయ్యద్ ఫజల్ హుస్సేన్, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాశ్‌వర్మ,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు గోనెల రవీందర్, సివిల్ సప్లై డీటీలు కిరణ్‌కుమార్, రేణుక, అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రుల యాజమాన్యాలు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే ఆస్పత్రులను సీజ్ చేయడంతోపాటు వారి సర్టిఫికెట్ల రద్దుకు సిఫారసు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రోత్సహించిన వారికి శిక్షతోపాటు జరిమానా విధిస్తామని వివరించారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా అక్రమంగా కొందరు స్కానింగ్ తీస్తూ అబార్షన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆడపిల్లల నిష్పత్తి పెరిగేందుకు గ్రామ, మండలస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అడిషనల్ అండ్ సెషన్స్ జడ్జి సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి స్కానింగ్ సెంటర్ సమయానుకూలంగా రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, ఫసియుద్దీన్, ఎస్సై అయితు వెంకటేశ్వర్లు, అధికారులు అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల జాబితా సిద్ధం చేయండి

పట్టభద్రుల ఎన్నికల జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టర్ సమావేశపు హాల్‌లో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు పట్టభద్రుల ఎన్నికల జాబితాపై జరిగిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, డీఎల్‌ఎంటీ ఎస్.పట్టాభి శ్రీనివాస్, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీ స్థానానికి పరిశీలించండి



సీపీఐ నేతలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెనిన్

న్యూశాయంపేట : వరంగల్ పార్లమెంట్ స్థానానికి ఇండియా కూటమి తరఫున తన పేరును పరిశీలించాలని సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర నాయకుడు బీఆర్ లెనిన్ గురువారం సీపీఐ నేతలు నారాయణ, కూనంనేని సాంబశివరావును హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రజానాయకుడు దివంగత సీపీఐ నేత భగవాన్‌దాస్ వారసుడిగా పార్టీ ఆదేశిస్తే పోటీకి రెడీగా ఉన్నట్లు ఆయన నాయకులకు తెలిపారు. దీనిపై నాయకులు సానుకూలంగా స్పందించినట్లు లెనిన్ చెప్పారు.

ఆర్టీఓ అఫ్రిన్ సిద్దిఖీ బదిలీ



అఫ్రిన్ సిద్దిఖీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంవీఐలు రమేష్ రాథోడ్, రవీందర్


ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా రవాణా శాఖ అధికారి (ఆర్టీఓ) అఫ్రిన్ సిద్దిఖీ గురువారం పెద్దపల్లి ఆర్టీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. పెద్దపల్లి జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్టీఓ రంగారావును వరంగల్ ఆర్టీఏకు బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం బదిలీపై వెళ్తున్న ఆర్టీఓ అఫ్రిన్ సిద్దిఖీని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్ రాథోడ్, కోల రవీందర్, ఏఎంవీఐలు శాలిని, స్వర్ణలత, ఏఓ నరేందర్ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ పన్ను నిబంధనలపై అవగాహన ఉండాలి



ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న మాధవి

మహబూబాబాద్: ఆదాయ పన్ను నిబంధనలపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన ఉండాలని కేంద్ర ప్రభుత్వ అధికారి, ఆదాయ పన్ను జిల్లా ఇన్‌చార్జులు సునీల్‌కుమార్ మిశ్రా, మాధవి అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో ఆదాయ పన్నుల చెల్లింపు, త్రైమాసిక, వార్షిక రిటర్న్ దాఖలు, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు పన్ను నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, డీటీఓ నాగన్న దొర, డిప్యూటీ సీఈఓ నర్మద, సీపీఓ సుబ్బారావు, కలెక్టరేట్ ఏఓ వెంకటరమణ పాల్గొన్నారు.



మార్గం, పదునైన కత్తి అంచులా నిశితమై, ఎన్నో అవరోధాలతో నిండి ఉంది, అయినా నిస్పృహ చెందకండి. లేవండి, మేల్కొండి, గమ్యాన్ని చేరేవరకూ విశ్రమించకండి.

ఒక ఆలోచనను స్వీకరించండి. దాని గురించే ఆలోచించండి. దాని గురించే కలగనండి. మీ నరనరాల్లో ఆ ఆలోచనలు జీర్ణించుకుపోనీయండి. మిగతా ఆలోచనలను పక్కకు పెట్టండి. ఇలా చేస్తే విజయం మిమ్మల్ని తప్పక వరిస్తుంది.

అనాలోచితంగా తొందరపడి ఏమీ చేయొద్దు. చిత్తశుద్ధి, ఓర్పు, పట్టుదల ఈ మూడూ కార్యశుద్ధికి ఆవశ్యకాలు. కానీ ప్రేమ ఈ మూడింటి కన్నా ఆవశ్యకం.

మీకు సాయం చేస్తున్న వారిని మరువకండి. మిమ్మల్ని ప్రేమిస్తున్న వారిని ద్వేషించకండి. మిమ్మల్ని నమ్ముతున్న వారిని మోసం చేయకండి.

-స్వామి వివేకానంద

యువజనోత్సాహం..

స్వామి వివేకానంద.. ఉరకలెత్తే ఉత్సాహానికి మారుపేరు. నిండైన యవ్వనానికి ప్రతీక. నిద్రావస్థలో ఉన్న యువతలో జవసత్వాలు నింపి.. జాతిని జాగృతి చేసి అభివృద్ధి వైపు అడుగులేసేలా మేలుకొలిపే శక్తివంతమైన ఆయుధం. 1893 సంవత్సరం చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో పాల్గొని తన ప్రసంగం ద్వారా భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పిన మహనీయుడు, యూత్ ఐకాన్ స్వామి వివేకానంద. ఆయన మాటలకు మంత్రముగ్ధులైన దేశ యువత.. పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ వివేకానందుడి బాటలో పయనిస్తోంది. నేడు వివేకానంద జయంతి సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్న యువత, యువజన సంఘాలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

పర్యావరణ పరిరక్షణలో 'రాక్‌స్టార్' మార్క్..



అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం (ఫైల్)

నర్మెట: మండలంలోని వెల్దండ గ్రామంలో రాక్‌స్టార్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ స్థాపించి దాదాపు 8 సంవత్సరాలు పూర్తయింది. ఈ కాలంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో దూప దీప నైవేద్యానికి నోచుకోని వేణుగోపాల స్వామి దేవాలయాన్ని శుద్ధి చేసి నిత్య పూజలు జరిగేలా కృషి చేశారు. వీరి సేవ కార్యక్రమాన్ని గుర్తించిన ఉత్తర్‌ప్రదేశ్ హరిద్వార్‌లోని దివ్య ప్రేమ్ సేవా మిషన్.. రాక్‌స్టార్ యూత్ అసోసియేషన్‌కు జాతీయ అవార్డు ప్రదానం చేసింది. అంతే కాకుండా వెల్దండలో ఎన్నో నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. యూత్ సభ్యుల పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం కార్యక్రమం చేపడుతున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహిస్తున్నారు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా యూత్ ఆధ్వర్యంలో ఏటా మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన ఆదర్శ యువజన సంఘంగా రాక్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ నిలిచింది.

అభాగ్యులకు అండ.. వెంకటాపురం యువత..



పేదలకు బియ్యం అందజేస్తున్న వెంకటాపురం ట్రస్టు ప్రతినిధులు (ఫైల్)

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కొండా యాకన్న 2019లో స్థానిక యువత తోడ్పాటుతో 'వెంకటాపురం సేవా ట్రస్టు' ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. దాతల సహకారంతో ఐదేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. వెంకటాపురం ట్రస్టులో 40 మంది సభ్యులు ఉండగా వీరంతా ప్రతి నెలా రూ.100 విరాళం అందజేస్తున్నారు. దీంతో పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు దాతలు సహకరిస్తున్నారు. కరోనా సమయంలో 120 కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం అందించారు. అలాగే, గ్రామానికి చెందిన బానోతు బుల్లమ్మ, ధారావత్ అంజలి అనారోగ్యానికి గురి కాగా రూ.47 వేల ఆర్థిక సాయమందించారు. పలువురు నిరుపేదల అంత్యక్రియల నిమిత్తం పలు సందర్భాల్లో బాధిత కుటుంబీకులకు రూ.96 వేలు అందించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి క్రీడా సామగ్రి వితరణ చేశారు. వితంతువులు, వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ప్రతిభ గల విద్యార్థులకు విద్యా సామగ్రి ఉచితంగా అందించారు. సంక్రాంతికి ముగ్గుల పోటీలు, బతుకమ్మ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు.

సమాజ సేవలో 'రెయిన్‌బో'..



రహదారి మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న యూత్ సభ్యులు (ఫైల్)

తరిగొప్పుల: సమాజ సేవలో మేము సైతమంటూ మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు 2022 రెయిన్‌బో యూత్ అసోసియేషన్ స్థాపించారు. తద్వారా గ్రామ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు ఆధ్వర్యంలో సభ్యులు బోగం అనూప్, మహ్మద్ అక్తర్, జొన్నగోని రవి, రాజు, పాకనాటి రాజేందర్, తరుణ్, నరేష్.. చలివేంద్రాలు, రహదారుల్లోని మలుపుల వద్ద సూచిక హెచ్చరిక బోర్డులు, వృద్ధులు, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ వద్ద సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. గ్రామంలో 21 బాధిత కుటుంబాలకు బియ్యం, నూనె, నిత్యావసర సరుకులతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. అలాగే, హుస్నాబాద్–జనగామ ప్రధాన రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలు పూడ్చారు. అసోసియేసన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి రూ.1.20 లక్షల వ్యయంతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

మృతులు, నిరుపేద కుటుంబాలకు బాసట..



ఈరవెన్నులో ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయం చేస్తున్న సభ్యులు (ఫైల్)

పాలకుర్తి: మండలంలోని వావిలాలకు చెందిన ఉద్యోగి గంట రవీందర్ 'మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్' సొసైటీ ఏర్పాటు చేసి పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే, మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్, హరీష్ 'అమ్మ ఫౌండేషన్' ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. ఈరవెన్ను గ్రామంలో 'ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ'ను ఏర్పాటు చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో మృతుల, నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. అలాగే, కరోనా సమయంలో ఎంతోమందికి తోడ్పాటు అందజేశారు.

సాయం చేసే చేతులు మిన్నా..



నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నేతాజీ సర్వీస్ టీమ్ సభ్యులు (ఫైల్)

గీసుకొండ : మండలంలోని ఊకల్‌హవేలికి చెందిన విద్యాశాఖలో అటెండర్‌గా పని చేస్తున్న మొగసాని శంకర్, అతడి మిత్రులు కలిసి ఏర్పాటు చేసిన 'నేతాజీ సర్వీస్ టీమ్' సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడమే పరమావధిగా సర్వీస్ టీమ్ 2013 నుంచి సేవలు అందిస్తోంది. మొగసాని శంకర్ ఇప్పటి వరకు 24 సార్లు రక్తదానం, 4 సార్లు ప్లాస్మా దానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. రక్తం కావాలని ఎవరైనా ఆపదలో ఫోన్ చేస్తే చాలు .. వెంటనే స్పందించి దాతలు ముందుకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శంకర్‌తో పాటు నేతాజీ సర్వీస్ టీమ్‌లో 25 మంది సభ్యులుగా ఉన్నారు. అటవీ ప్రాంతంలోని గుత్తికోయల గూడేలకు వెళ్లి వారికి నిత్యావసర సరుకులు, పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 2450 మందికి రక్తదానం చేయగా 90 సార్లు అన్నదానం చేశారు. పేద మృతుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. వీరి సేవలకు సుమారు 20కి పైగా జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' తోడ్పాటు..



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీమ్ సభ్యులు (ఫైల్)

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన యువకులు 2019లో శ్రీహెల్పింగ్ హ్యాండ్స్ టీమ్' ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కరోనా ఆపత్కాలంలో అనేక ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు అందించారు. కరోనా బాధితులు, మృతుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. అలాగే, గతేడాది సంభవించిన వరదల్లో మోరంచపల్లి గ్రామంలో ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు అందించారు. రక్తదాన కార్యక్రమాల్లో కూడా పాల్గొని ఆపద సమయంలో బాధితులకు తోడ్పటు అందిస్తున్నారు.

క్రీడలు, శ్రమదానాలతో ముందుకు..



జఫర్‌గఢ్‌లో ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ సభ్యుల(ఫైల్)

జఫర్‌గఢ్ : 180 మంది యువకులతో కలిసి ఏడాదిన్నర క్రితం జఫర్‌గఢ్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జిల్లా, మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా గ్రామంలో పలు కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా పెరిగిన తుమ్మ చెట్ల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత వంటి శ్రమదానాలతో పాటు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు చవనబోయిన అరుణ్ తెలిపారు. వీటితో పాటు భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

వృత్తి ఉద్యోగం.. ప్రవృత్తి సమాజ సేవ

- ఆదర్శంగా నిలుస్తున్న వినోద్



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న వినోద్ (ఫైల్)

కురవి: అతడికి చదువుకునే రోజుల నుంచే సమాజ సేవ చేయాలనే తపన.. ఇకేం..అనుకున్నదే తడువుగా ఒకపక్క చదువుకుంటూనే మరో పక్క సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టాడు. అంతటితో ఆగకుండా ఉద్యోగం చేస్తూ కూడా వివిధ సామాజిక కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతనే మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్యతండా జీపీకి చెందిన బోడ వినోద్ కుమార్. వినోద్ కుమార్ ప్రస్తుతం పోస్టల్ శాఖలో చిరు ఉద్యోగి. బ్రైట్ ఇండియా స్వచ్ఛంద సంస్థను స్థాపించి గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాడు. పుస్తకాల వితరణ, పరీక్ష సామగ్రి పంపిణీ, ఖాళీ సమయాల్లో ట్యూషన్, వ్యాసరచన, ఆటలపోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తున్నాడు. యువతలో చైతన్యం నింపడం కోసం పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నియంత్రణ, మూఢనమ్మకాల విముక్తి, ఓటు హక్కు వినియోగంపై సదస్సులు నిర్వహించాడు. 13 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా మారాడు. అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



వినోద్‌కుమార్

జనగామ డీఎంహెచ్‌ఓ లంచావతారం

ఏసీబీకి చిక్కిన ఆయనతోపాటు జూనియర్ అసిస్టెంట్

- ఫార్మసిస్టు వద్ద రూ.50వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- అధికారుల అదుపులో ఇద్దరు, నేడు రిమాండ్
- యాభైరోజుల వ్యవధిలో డబుల్ ధమాకా



డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో ఏసీబీ అధికారులు



ఏసీబీకి పట్టుబడిన డీఎంహెచ్‌ఓ ప్రశాంత్, కార్యాలయ జేఏ అజహార్

జనగామ: జనగామ జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ప్రశాంత్, జూనియర్ అసిస్టెంటు ఎండీ అజహార్ గురువారం ఏసీబీ వలకు చిక్కారు. ఫార్మసిస్టు ఉద్యోగం రెన్యువల్ కోసం లంచం డిమాండ్ చేసి అడ్డంగా దొరికి పోయారు. దీంతో జనగామ కలెక్టరేట్‌లో ఒక్కసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉమ్మడి వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణానికి చెందిన కె.స్రవంతి జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2021 నుంచి ఔట్ సోర్సింగ్‌లో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. 2023 అక్టోబర్‌లో పీహెచ్‌సీకి రెగ్యులర్ ఉద్యోగి రావడంతో, స్రవంతిని రఘునాథపల్లికి డిప్యుటేషన్‌పై పంపించారు. పదిరోజుల తర్వాత స్రవంతిని ఉద్యోగంనుంచి తొలగించడంతో ఆమె డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రశాంత్‌ను కలిసింది. రూ.లక్ష లంచంగా ఇస్తే, రెండు నెలల వేతనంతోపాటు తిరిగి పోస్టింగ్ ఇస్తామని చెప్పారు. దీంతో ఏమీ పాలుపోని స్రవంతి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి కన్నీళ్లు పెట్టుకుంది. ఎలాగైనా ఉద్యోగం చేయాలనే పట్టుదలతో మరోసారి డీఎంహెచ్‌ఓను కలిసి అడిగిన డబ్బులు ఇస్తానని ఒప్పుకుంది. ఆయన జూనియర్ అసిస్టెంట్ ఎండీ అజహర్‌ను కలవాలని చెప్పాడు. ఆమె వారం రోజుల క్రితం అజహార్‌కు రూ.50 వేలు ముట్టు జెప్పారు. మిగతా రూ.50వేలు ఇస్తేనే పోస్టింగ్ ఇస్తామని ఒత్తిడి చేయడంతో, స్రవంతి మూడు రోజులు క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు డీఎస్పీ సాంబయ్య లంచం డిమాండ్‌కు సంబంధించి పూర్తి ఆధారాలు సేకరించి, కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. స్రవంతి రూ.50వేలు తీసుకుని కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ఉన్న డీఎంహెచ్‌ఓ చాంబర్‌కు వెళ్లి ఆయనకు ఇవ్వాలని ప్రయత్నం చేయగా, జూనియర్ అసిస్టెంటును పిలిపించారు. ఇద్దరు కలిసి చేతికి డబ్బులు తీసుకోకుండా, పక్కనే ఉన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టేబుల్ డ్రాలో పెట్టాలని చెప్పగా, అదే సమయంలో ఏసీబీ అధికారులు రైడ్ చేశారు. ఫోన్ సంభాషణలు, రెడ్ హ్యాండెడ్‌గా కనిపించిన ఆధారాల మేరకు డీఎంహెచ్‌ఓ, జూనియర్ అసిస్టెంటులను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. వారిని హైదరాబాద్ నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట సీఐలు శ్యాం, శ్రీనివాస్, రవి ఉన్నారు.

గత నవంబర్‌లోనే కమిషనర్..

గత ఏడాది నవంబర్ 20వ తేదీన జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత, ఆమె కారు డ్రైవర్ నవీన్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. 50 రోజులు గడవక ముందే, జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారి, అదే కార్యాలయంలోని కింది స్థాయి ఉద్యోగి ఇద్దరు పట్టుబడడంతో జిల్లాలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల బాగోతం మరోసారి చర్చనీయాంశమైంది.

ఒత్తిడి చేస్తేనే

నా కూతురు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఫార్మసిస్టు ఉద్యోగం చేస్తున్న క్రమంలో, రెగ్యులర్ ఉద్యోగి వచ్చారని రఘునాథపల్లికి డిప్యుటేషన్‌పై పంపించారు. అక్కడ కూడా ఉద్యోగం లోనుంచి తీసి వేసి, పోస్టింగ్ కోసం రూ.లక్ష డిమాండ్ చేయడంతోనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాం.

కామునిశ్రీనివాస్, స్రవంతి తండ్రి

మేడారం.. 8 జోన్లు, 42 సెక్టార్లు

- ఐటీడీఏ పీఓ అంకిత్



మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఎస్ఎస్ తాడ్వాయి : సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణకు మేడారం ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించామని, ఈనెలాఖరు కల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం మేడారంలోని సమ్మక్క భవనంలో జాతర నిర్వహణపై ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెక్టార్లకు సంబంధించి అధికారులను కూడా నియమించామని, జాతర దగ్గర పడుతున్న నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతర నిర్వహణ మొత్తంలో నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని, వారందరూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రతి జోనల్ అధికారితో మిగతా అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులను కూడా సిద్ధం చేశామన్నారు. గతంలో 3,200 బస్సులను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం 7 జిల్లాల 6 వేల బస్సులను సిద్ధం చేశామన్నారు. భక్తులకు త్వరలో వైద్య సేవలందిస్తామని డీఎంహెచ్‌ఓ అప్పయ్య వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, డీపీఓ వెంకయ్య, సంక్షేమ అధికారి ప్రేమలత, ఏపీఓ వసంతారావు, ఎన్పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- టీయూసీఐ జాతీయ నేత మానసయ్య



మాట్లాడుతున్న మానసయ్య

ఖిలా వరంగల్ : కార్మిక వ్యవస్థను కాలరాసిన ప్రభుత్వాలను ప్రజలే తరిమికొట్టాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని టీయూసీఐ జాతీయ నేత ఆర్. మానసయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వరంగల్ శివనగర్‌లోని కార్మిక ఫంక్షన్ హాల్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కుమారస్వామి అధ్యక్షతన రాష్ట్ర ద్వితీయ మహాసభ జరిగింది. ఈ మహాసభకు మానసయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని 265 రోజులకు పెంచి రోజూ కూలి చెల్లించాలన్నారు. రాష్ట్ర విద్యుత్ కంపెనీల్లో పనిచేసే కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న టీయూసీఐ 10వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సైదయ్య, కేదల ప్రసాద్, రాౌతు శ్రీను, యాదవరెడ్డి, మెడిగి సతీష్ పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు క్యాజువల్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి గురువారం తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడంతో వీరిని విధుల నుంచి తొలగించామన్నారు. రెగ్యులర్ విద్యార్థులు తమ మెమోలను కళాశాలల నుంచే పొందాలన్నారు. రీవాల్యూవేషన్‌లో బెనిఫిట్ పొందిన విద్యార్థులు మాత్రమే పరీక్షల విభాగం నుంచి తీసుకెళ్లాలన్నారు.

కారు, బైక్ ఢీ..

- బాలుడి దుర్మరణం,
- తండ్రికి తీవ్ర గాయాలు



యాకేష్ (ఫైల్)

రాయపర్తి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందగా తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండలంలోని మైలారం, రాయపర్తి గ్రామాల మధ్యలోని బ్రిడ్జి సమీపంలో జరిగింది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం మండలంలోని పన్యానాయక్‌తండాకు చెందిన జాటోతు రమేష్ తన కుమారుడు యాకేష్(6)ను తీసుకుని పనినిమిత్తం బైక్‌పై రాయపర్తికి వస్తున్నాడు. భీమారానికి చెందిన దొమ్మటి శ్వేత తొర్రూరు మండలం నాంచారిమడూరులో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తుండగా ఆమెను డ్రాప్ చేసేందుకు తన భర్త రాజు కారులో తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలో బ్రిడ్జి సమీపంలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న రమేష్, యాకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే యాకేష్‌ను ఓ ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. రమేష్ చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనపై రమేష్ తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, 108 వాహనం సకాలంలో ఘటనాస్థలికి చేరకపోవడంపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



తీవ్రంగా గాయపడిన రమేష్